క్లుప్తంగా

బాలరాముడి చిత్రపటం బహూకరణ



శాయంపేట : మండలంలోని సూర్యానాయక్ తండా గ్రామానికి చెందిన గండ్ర దంపతుల వీరాభిమాని తిరుపతి నాయక్ ఇటీవల తండా నుంచి అయోధ్య వరకు సైకిల్ యాత్ర చేసి తిరిగి వచ్చాడు. గురువారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, వరంగల్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, జయశంకర్ బీఆర్‌ఎస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతిని మర్యాదపూర్వకంగా కలిసి బాలరాముడి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా తిరుపతి దంపతులను గండ్ర దంపతులు శాలువాతో సత్కరించారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తపై దాడి

పరకాల : మండలంలోని నాగారం గ్రామంలో పంచాయతీ ట్రాక్టర్‌ను మొరం తరలింపునకు వినియోగిస్తున్నారని ఫొటో తీసి సోషల్ మీడియా ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశాడనే కోపంతో బీఆర్‌ఎస్ కార్యకర్త గొట్టె అనిల్‌పై గురువారం రాత్రి దాడి చేశారు. గ్రామ పంచాయతీ సమీపంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి అనుచరుడు అజయ్ తనపై దాడి చేశాడంటూ పరకాల పోలీసులకు అనిల్ ఫిర్యాదు చేశాడు.

వ్యక్తి అదృశ్యం



శ్రీకాంత్

ధర్మసాగర్ : మండలంలోని సాయిపేట గ్రామానికి చెందిన ముద్రవేణి శ్రీకాంత్ అదృశ్యమయ్యాడని పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం శ్రీకాంత్ ఎలకతుర్తిలోని తన భూమి వద్దకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటికి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు చెప్పారు. దీంతో తన భర్త కనబడటం లేదని శ్రీకాంత్ భార్య మానస గురువారం ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఆచూకీ తెలిసిన వారు 87126 85010, 8712685127, 8712685247 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

30న రాష్ట్రస్థాయి కళాకారుల సదస్సు

ఖిలా వరంగల్: ఈనెల 30న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ భవనంలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కవులు, కళాకారులు సదస్సు నిర్వహించనున్నట్లు ప్రజా నాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో వరంగల్ జిల్లా కళాకారులు గన్నారపు రమేష్, దామెర కృష్ణ అధ్యక్షతన ప్రజానాట్య మండలి ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ కవులు, కళాకారుల సమస్యలు పరిష్కరించాలని, గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రయాణాల్లో రాయితీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కోటా, క్రీడాకారులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

కిరాణా షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్: అక్రమంగా గుట్కాలు విక్రయిస్తున్న కిరాణం షాపు వ్యాపారిపై కేసు నమోదు చేసి, అతడి వద్ద నుంచి రూ.1,61,850 విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని సాయిబాబా గుడి లేన్‌కు చెందిన వేముశెట్టి విశ్వనాథం తన కిరాణం షాపులో గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అందించిన సమాచారం మేరకు ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు ఆధ్వర్యంలో గురువారం దాడి చేశారు. విశ్వనాథంపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కేసును మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు వివరించారు. దాడుల్లో ఆర్‌ఎస్సై భాను ప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: వచ్చే నెల 10వ తేదీన గురుపౌర్ణమి పురస్కరించుకొని నగరంలోని ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా మందిరంలో వారం రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలతో పాటు చిన్మయి మిషన్ వరంగల్ యజ్ఞానంద స్వామి ఆధ్వర్యంలో జులై 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జ్ఞానయజ్ఞ సప్తాహం నిర్వహించనున్నట్లు మందిర చైర్మన్ ఎం. హరిగోపాల్ తెలిపారు. ఈ మేరకు మందిరం ఆవరణలో ధర్మకర్తలతో కలిసి కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. గురుపౌర్ణమి సందర్భంగా బాబాకు విశేష పూజలతో పాటు మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అర్చన, అభిషేకాలు జరుగుతాయని, మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రాకం సదానందం, నిమ్మల శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'కస్తూర్బా'లో అడ్మిషన్లు ఫుల్



అడ్మిషన్ కావాలని అడుగుతున్న విద్యార్థినులు, తల్లిదండ్రులు



ఐనవోలులోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం

(ఇన్‌సెట్‌లో) అడ్మిషన్స్ క్లోజ్ బోర్డు

ఐనవోలు కేజీబీవీలో ప్రవేశాలకు క్యూ

- టెన్త్, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలతో విద్యార్థినుల తల్లిదండ్రుల ఆసక్తి

ఐనవోలు : కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు పేద బాలికలకు వరంగా మారుతున్నాయి. ఐనవోలు కేజీబీవీలో ఆరు నుంచి 10వ తరగతి వరకు 200, ఇంటర్‌లో 160 మంది విద్యార్థినులకు మాత్రమే అడ్మిషన్ అవకాశం ఉంది. కానీ అధిక డిమాండ్‌తో విద్యాలయంలో పరిమితికి మించి ఇప్పటికే 385 మంది వరకు చేర్పించుకున్నట్లు తెలిసింది. ఆయా తరగతుల్లో తమ పిల్లలను చేర్పించుకోవాలని 510 దరఖాస్తులు వచ్చాయని తమ విద్యాలయంలో అడ్మిషన్లు పూర్తయ్యాయని జిల్లాలోని ఇతర కేజీబీవీలకు రిఫర్ చేస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ కోటగిరి సునీత తెలిపారు. పాఠశాల ప్రారంభమై 15 రోజులు అవుతున్నా.. ఇప్పటికీ రోజూ పదుల సంఖ్యలో అడ్మిషన్ కోసం విద్యార్థినుల తల్లిదండ్రులు వస్తున్నట్లు పేర్కొన్నారు.

వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు

2024–25 విద్యా సంవత్సరానికి కేజీబీవీ విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించారు. మూడేళ్లుగా టెన్త్‌లో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు ఈసారి 12 మంది విద్యార్థినులు 500కుపైగా మార్కులు సాధించారు. అదేవిధంగా ఇంటర్ బైపీసీలో రాష్ట్ర 12వ ర్యాంకు రావడం కేవలం ముగ్గురు మినహా అందరూ పాస్ అయ్యారు. కేజీబీవీల్లో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, అనాథ తదితర కేటగిరి వర్గాలకు సీట్లు కేటాయిస్తుండటం విశేషం.

అడ్మిషన్లకు డిమాండ్..

కేజీబీవీల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన భోజనం, విద్య, ఉత్తమ ఫలితాలు రావడం, బాలికల రక్షణకు ఎలాంటి ఇబ్బంది లేకపోవడం, ఉచిత యూనిఫాం, వసతితో పాటు అవసరమైన మేరకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఒకసారి విద్యాలయంలో చేర్పించిన తర్వాత విద్యార్థులకు ఎలాంటి ఖర్చులు లేకపోవడం తల్లిదండ్రులు మండల కేంద్రంలోని కేజీబీవీలో తమ పిల్లలను చేర్పించడానికి ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో అడ్మిషన్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడినట్లు తెలుస్తోంది.

విద్యార్థినులకు నాణ్యమైన పౌష్టికాహారం

పేద విద్యార్థినులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాబోధనతో పాటు నాణ్యమైన ఆహారం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. గతంలో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం మెస్ చార్జీల కింద రూ.1,225 చెల్లిస్తుండగా ఈ ఏడాది నుంచి రూ.1,740 చొప్పున చెల్లిస్తోంది. నెలకు రెండు సార్లు మాంసం, 5 సార్లు చికెన్, వారంలో రోజులు గుడ్లు, శాఖాహారులకు మీల్ మేకర్ అందిస్తున్నారు. రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనంతో పాటు సాయంత్రం ఉడికించిన పెసర్లు, శనిగలు, బఠాణీలు, బొబ్బెర్లు, ఎగ్ బజ్జీ, పల్లీ పట్టి, నువ్వుల లడ్డు, మిల్లెట్ బిస్కెట్, పకోడి ఇస్తున్నారు. ఇక రాత్రి భోజనంలో ఆకుకూర, సాంబార్, మజ్జిగ ఆహార పట్టికలో పొందుపర్చారు.

నాణ్యమైన విద్య అందిస్తున్నాం..



కేజీబీవీలో విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేస్తున్నాం. బాలికలకు రక్షణ కల్పించడమే కాకుండా నాణ్యమైన మెనూతో భోజనం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. సీట్లు పూర్తయిన విద్యార్థినులు, తల్లిదండ్రులు అడ్మిషన్ల కోసం వస్తుండటంతో నో అడ్మిషన్ అయిపోయినట్లు బోర్డు పెట్టాం. ఖాళీలు ఉన్న వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ఇతర కేజీబీవీలకు వెళ్లాలని సూచిస్తున్నాం.

– కోటగిరి సునీత, స్పెషల్ ఆఫీసర్

నూతన అభివృద్ధి పనులు చేపట్టాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : మున్సిపల్ పరిధిలోని పెండింగ్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు నూతన అభివృద్ధి పనులను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం పరకాల పట్టణంలో టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమావేశం నిర్వహించి మున్సిపల్ అభివృద్ధి పనులను సమన్వయంతో ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి

అర్హులకు దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని, మొదటి దశలో మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కోరారు. రూ.450కే టన్ను కంకర అందజేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సుష్మా, మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు సోదా రామకృష్ణ, శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, మున్సిపల్, హౌజింగ్ అధికారులు, వార్డు ఆఫీసర్స్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం అవగాహన..

రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై వ్యవసాయ అధికారులకు, రైతులకు పలు సూచనలు చేశారు. సేంద్రియ పంట వ్యవసాయ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, మండలానికి 125 మంది రైతులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, పరకాల ఏడీ రవీందర్, ఏఓలు రాకేష్, జైసింగ్, యాదగిరి, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- ఎస్వీ విద్యాసంస్థల అధినేత శ్రీనివాసాచారి
- గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాసాచారి, సతీష్‌రెడ్డి తదితరులు

పరకాల : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని, స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో గొప్పగా ఉండేదని ఎస్వీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సిరికొండ శ్రీనివాసాచారి పేర్కొన్నారు. తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు కామిడి సతీష్‌రెడ్డి పరకాల గ్రంథాలయానికి రూ.5వేల విలువైన పుస్తకాలను పలువురు మేధావుల సమక్షంలో గ్రంథపాలకుడు రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసాచారి మాట్లాడుతూ సెల్‌ఫోన్ మోజులో చాలా మంది భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సతీష్‌రెడ్డి పాఠకుల కోసం పుస్తకాలు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ముఖ్యసలహాదారులు సుధాకర్, రేపాల నర్సింహారాములు, రామదాసు, జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి

- పల్లె దవాఖాన వైద్యాధికారి మహేందర్



మాట్లాడుతున్న డాక్టర్ మహేందర్

ధర్మసాగర్ : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా పాటించాలని పల్లె దవాఖాన వైద్యాధికారి పుట్ట మహేందర్ సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, సురక్షితమైన, కాచి వడపోసిన నీటిని తాగాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ధర్మ ప్రకాశ్, ఉపాధ్యాయులు కవితాదేవి, కిరణ్మయి, రాజమ్మ, పద్మజా, రామకృష్ణ, ప్రసన్న, రమ్యశ్రీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్ : రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర నాయకుడు తొటం రవీందర్, సీనియర్ నాయకుడు పోడేటి భిక్షపతి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కమలాపూర్‌లో రైతు భరోసా సంబురాలు నిర్వహించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానాకాలం పంట పెట్టుబడుల కోసం రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమచేయడం అభినందనీయం అని, రైతులపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట దేవస్థాన డైరెక్టర్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, కాంగ్రెస్ నాయకులు పుల్లూరి శ్రీనివాసరావు, తడుక శ్రీకాంత్, బొల్లం రాజిరెడ్డి, పుల్ల రామస్వామి, తాళ్లపెల్లి గణేష్, చక్రపాణి, రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు చేరాల రోహిత్, ఆడెపు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

శాయంపేట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురువారం ఎంఈఓ కార్యాలయంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూతాటి రమేష్, పురాణం చంద్రశేఖర్, అంబాటి అఖిల్ పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం



ఐనవోలు: విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు



శాయంపేట: విద్యార్థులకు డిక్షనరీలు అందజేస్తున్న సురేష్

ఐనవోలు : దాతల సేవలు అభినందనీయమని పున్నేలు జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాసుధారెడ్డి కొనియాడారు. గురువారం సింగారం గ్రామానికి చెందిన దాత ముక్కెర అనిల్‌రెడ్డి పున్నేలు పాఠశాలలో 120 మంది విద్యార్థులకు రూ.15వేల విలువైన నోట్‌బుక్స్, స్టేషనరీ, తదితర వస్తువులు ఉచితంగా అందజేశారు. హెచ్‌ఎం రాసుధారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఏపీసీ అధ్యక్షురాలు రమ, మాజీ సర్పంచ్ కత్తి దేవేందర్, జన్ను రాజు, పూర్ణచందర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, నరేష్, ఉపాధ్యాయులు అన్నారెడ్డి, ఇందిర, వెంకటయ్య, శిరీష, వెంకటేశ్వర్‌రావు, స్వప్న, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

శాయంపేట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.సురేష్ గురువారం రూ.8వేల విలువైన ఇంగ్లిష్, తెలుగు డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కాయిత శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు నిఘంటువులను ఉపయోగించుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మశ్రీ, సదానందం, అజీముద్దీన్, రాజిబాపూ రావు, సత్యప్రసాద్, ఉదయశ్రీ, రాము, రాజేష్ కుమార్, సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

'శాంతిదీక్షకు అనుమతి ఇవ్వండి'



సీఐ రంజిత్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

శాయంపేట : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 30న (సోమవారం) మండల కేంద్రంలో చేపట్టనున్న శాంతి దీక్షకు అనుమతి ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం సీఐ రంజిత్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి రవీందర్ మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు మేనిఫెస్టోలో చెప్పిన హామీలు అమలు చేయాలని కోరారు. ఈ నెల 30న మండల కేంద్రంలో చేపట్టనున్న తెలంగాణ ఉద్యమకారుల ఒక్కరోజు శాంతి దీక్షకు మండలంలోని తెలంగాణ ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పాడిశెట్టి గణేష్, గిద్దమారి సురేష్, గంటా శ్యాంసుందర్ రెడ్డి, గిద్దమారి రామన్న, చల్లా శ్రీనివాస్ రెడ్డి, ఎండీ రఫీ, తుమ్మ ప్రభాకర్, దుంపల మహేందర్ రెడ్డి, కానుగల నాగరాజు, దూదిపాల జోగి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం

వరంగల్ చౌరస్తా: వరంగల్ అబ్బనికుంటలోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్ (ఆగఖాన్ ఎడ్యుకేషన్ సర్వీస్ ఇండియా) 10(టీ) బీఎన్ ఎన్‌సీసీ కేడెట్లకు గురువారం 'ఎ' సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. న్యూస్ రిపోర్ట్‌లో భాగంగా టెన్ టీవీ ఏఓ రవి సునెహరే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం వలన స్వీయ క్రమశిక్షణ పెంపొందుతుందని, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ జగదీష్ పెచే, వైస్ ప్రిన్సిపాల్ ఉత్తమ్ చటర్జీ, ఎన్‌సీసీ ఆఫీసర్ నవీన్ నన్, సెక్షన్ హెడ్ ప్రసన్న బిదురు, అడ్మిన్ ఆఫీస్ మేనేజర్ సాంబమూర్తి, అన్వర్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ఆత్మకూరు: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ సంతోష్, విద్యార్థులు



ఐనవోలు: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్సై శ్రీనివాస్, విద్యార్థులు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పోలీసులు తెలిపారు. గురువారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై జిల్లావ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ పద్ధతుల్లో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై వివరించారు. ఎవరైనా మత్తు పదార్థాలు స్వీకరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్



శాయంపేట: కేయూ వీసీ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థిని



కమలాపూర్: మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



వేలేరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై సురేష్



బహుమతి అందుకుంటున్న ప్రణమ్య



ధర్మసాగర్ : మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు ధర్మప్రకాశ్

సంఘాల లావాదేవీల్లో పారదర్శకత కీలకం

- డీఆర్‌డీఓ ఏపీడీ రేణుకాదేవి

సంగెం : మహిళా సంఘాల లావాదేవీల్లో పారదర్శకత కీలకమని డీఆర్‌డీఓ ఏపీడీ రేణుకాదేవి తెలిపారు. మండలంలోని శాంతి మండల సమాఖ్యలో 49 గ్రామ సంఘాల్లోని అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. సంఘాల లావాదేవీలన్నిటిని పుస్తకంలో విధిగా నమోదు చేయాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకోవాలని తెలిపారు. సంఘాల బలోపేతంలో అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి కీలకమన్నారు. లావాదేవీలను పారదర్శకంగా నిర్వహిస్తూ సభ్యులకు నమ్మకం కలిగించాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎం దయాకర్, ఏపీఎం కిషన్, ఎస్‌ఆర్‌పీలు లక్ష్మి, ప్రమీలతో పాటు తదితరులు పాల్గొన్నారు.